పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

## 94. అలమ్ నష్రహ్ సూరా పరిచయం

మక్కాలో అవతరించింది. ఇందులో 8 ఆయత్‌లు, ఒక రుకూ ఉన్నాయి.

దైవప్రవక్తకు అడ్డంకులూ, అవాంతరాలేగాని, పరిస్థితి చక్కబడటం గాని, విజయం లభించే అవకాశాలు గాని కనుచూపు మేరలో కనబడని పరిస్థితులలో ఈ సూరా అవతరించింది. దైవప్రవక్త (స) కడు విచారంలో ఉండగా అల్లాహ్ ఈ సూరాలో విజయం లభించనున్నదన్న శుభవార్తను, విజయ సూచనలను అందిస్తున్నాడు.

آيَاتُهَا 8 | سُورَةُ الشَّرْحِ مَكِّيَّةٌ 94 | رُكُوعُهَا 1

بِسْمِ اللهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

أَلَمْ نَشْرَحْ لَكَ صَدْرَكَ ﴿1﴾ وَوَضَعْنَا عَنكَ
وِزْرَكَ ﴿2﴾ الَّذِي أَنقَضَ ظَهْرَكَ ﴿3﴾ وَرَفَعْنَا
لَكَ ذِكْرَكَ ﴿4﴾ فَإِنَّ مَعَ الْعُسْرِ يُسْرًا ﴿5﴾ إِنَّ
مَعَ الْعُسْرِ يُسْرًا ﴿6﴾ فَإِذَا فَرَغْتَ فَانصَبْ ﴿7﴾
وَإِلَىٰ رَبِّكَ فَارْغَب ﴿8﴾ ع 1 8 19

### 94. అలమ్ నష్రహ్

**ఆయత్‌లు : 8** **అవతరణ : మక్కాలో**

పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

(1) ఓ ముహమ్మద్! మేము నీ హృదయ కుహరాన్ని తెరువలేదా? (తప్పకుండా తెరిచాము) (2) మరియు నీపై నుండి భారాన్ని దింపివేయలేదా? (3) అది నీ వీపును విరిచింది. (4) నీ ప్రస్తుతిని ఉన్నతం చేశాము. (5) అవును, నిశ్చయంగా కష్టం తర్వాత సౌలభ్యం కూడా ఉంది. (6) నిశ్చయంగా కష్టం తర్వాత సౌలభ్యం ఉంది. (7) కనుక నీవు పని చేశాక తీరిక దొరికినప్పుడు (8) ఆరాధనలో నిమగ్నుడవు అయిపో, నీ ప్రభువు వైపు సావధానుడవు అవ్వు.

1 – 8 వాక్యాలు

హజ్రత్ ముహమ్మద్ (స) ప్రవక్త కాక పూర్వం మక్కాలో తన కుటుంబంలో గొప్ప గౌరవం ఉండేది. అందరూ ఆయన్ని సాదిఖ్ (సత్యవంతుడు) అనీ, అమీన్ (అమానతుదారు) అనీ బిరుదులతో గుర్తింపునిచ్చారు. ఆయన (స) ప్రవక్తగా ప్రకటించుకున్న తర్వాత, ఖుర్‌ఆన్‌ను దైవవాణిగా పేర్కొన సాగినప్పుడు అందరూ ఆయనకు శత్రువులయ్యారు. ఆయన్ని కలుసుకోవడానికే సిద్ధంగా లేరు. ఆయన మాట వినడానికి సిద్ధంగా లేరు. అందరూ ఆయన్ని అయిష్టపడేవారు. అందరూ ఆయనకు ప్రాణ శత్రువులయ్యారు. ఇటువంటి పరిస్థితులలో దైవప్రవక్త (స) తీవ్ర ఇబ్బందికి లోనయ్యారు. అల్లాహ్ ఆయనకు స్థయిర్యం కలిగించాడు. “మీరు వ్యాకులపడవద్దు, అతి త్వరలోనే పరిస్థితులు మీకు అనుకూలంగా మారిపోగలవు. విజయం మీ పాదాక్రాంతమవుతుంది. జయం, సహాయం మీ వెంట ఉంటాయి. కష్టాల ఈ యుగం బహుదీర్ఘమయినది కాదు. పైగా కష్టంతోపాటే సఫలతతో కూడిన కాలం కూడ వస్తుంది” అని అల్లాహ్ వాగ్దానం చేస్తున్నాడు.

చివరలో అల్లాహ్ చెబుతున్నాడు. “ఓ ముహమ్మద్ (స)! కష్టాల నెదుర్కొనడానికి శక్తి కావాలి. ఆ శక్తి ఆరాధన వల్ల లభిస్తుంది. మీరు పనులు పూర్తిచేసుకుని తీరిక అయినప్పుడల్లా అల్లాహ్ ఆరాధనలో నిమగ్నులు అయిపోండి. అన్ని విషయాల నుండి నిరపేక్షులయిపోయి మీ ప్రభువుపై మనసు లగ్నం చేసి, మీ ప్రభువు వైపు మరలండి.”

https://teluguislam.net/quran/